కథా నిలయం
శ్రీకాకుళం

# గ్రక్కున విడువంగ వలయు...

చాలా ఏళ్ల తర్వాత సుశీలను చూసేసరికి నేను చప్పున పోల్చుకోలేకపోయాను. అంతగా మారిపోయిందామె! పెళ్లప్పుడు చూశాను... ఆ తర్వాత రెండు మూడుసార్లు మా ఇంటికి వచ్చినపుడు చూశాను. అప్పుడెలా వుండేది? పచ్చటి శరీర కాంతితో, బాగా మాగిన నిమ్మపండు రంగులో ఎంతో ఆరోగ్యంగా వుండేది! పెద్ద పెద్ద కళ్లతో, నవ్వితే వింతగా సొట్టలుపడే చెక్కిళ్లతో, కాంతులు ఒలకబోస్తూ, దివ్యంగా, దీపంగా వుండేది! ఈ నాలుగైదేళ్లలో ఎంతమార్పు?

ఆరోజు సాయంత్రం ఆఫీసు నుండి వచ్చేసరికి, హాల్లో కూచుని వున్నారు సుశీలా, ఆమె భర్త. మా కుటుంబ సభ్యులు, అంటే నా భార్యా, కూతురూ, కొడుకూ వారితో మాటల్లో మునిగి వున్నారు. సుశీల భర్త వెంకటేశ్వర్లు కర్నూలులో పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. నన్ను చూడగానే 'విష్' చేశాడు. అప్పుడు చూశాను అతని పక్కనేవున్న సుశీలను... వెంకటేశ్వర్లు ప్రక్కనే కూచున్నది కాబట్టి, కాస్త నెమ్మదిగా చూసి, సుశీల అని పోల్చుకున్నాను కానీ.... మరెక్కడైనా చూసివుంటే చెప్పినా నమ్మేవాణ్ణి కాదు! అంతలా మారిపోయింది సుశీల! ఎలా వుందిప్పుడు సుశీల?

గుండ్రంగా వుండే చెక్కిళ్లు, పీక్కుపోయి బాడిసతో చెక్కివేసినట్టుగా వున్నాయి - పచ్చగావుండే ఆమె ముఖం పాలిపోయి తెల్లటి బూడిద రాసుకున్నట్టుగా పేలవంగా వుంది! మిలమిలా మెరిసే కళ్లలో ప్రేతకళ తొంగిచూస్తూ వుంది! బొద్దుగా వుండే ఆమె శరీరం కట్టెలా మిగిలిపోయి వుంది! ఆమె ధరించిన దుస్తులు కట్టెకు చుట్టినట్టుగా వున్నాయికాని, మనిషి కట్టుకున్నట్టుగా లేవు! చాలా ఆశ్చర్యపోయాను నేను.... ఈ నాలుగైదేళ్లలో ఇంత పెద్ద మార్పా? సుశీలకు ఎదురుగా కూచుంటూ "ఏమిటమ్మా యిలా అయ్యావ్! జబ్బేమైనా చేసిందా?" అంటూ పరామర్శించాను.

సుశీల పెదవి విప్పకముందే, వెంకటేశ్వర్లు కలుగజేసుకొని, "కడుపుకేదైనా తింటేగదా! ఎప్పుడూ ఏదో దిగులుతో వుంటుంది. అడిగినవాళ్లకు చెప్పలేక మధ్యన నేను ఛస్తున్నాననుకో" అన్నాడు. అతని గొంతులో ధ్వనించిన అసహనానికీ, కోపానికీ నాకు ఆశ్చర్యం వేసింది.

"దిగులా? దిగులేందిగులు...." అన్నాను నేను విస్తుబోతూ!

"అడుగు.... దాన్నే అడుగు" చిరాకుగా అన్నాడు వెంకటేశ్వర్లు.

సుశీల ముభావంగా తల దించుకుంది! ఆమె కళ్లమీద సన్నటి నీటిపొర కమ్ముకున్నట్టు నాకు అనుమానం వేసింది!

"డాక్టర్ల కెవరికైనా చూపించక పోయావా" అన్నాను నేను. "అన్నీ అయినాయి.. కొన్నాళ్లు పుట్టింట్లోనైనా వుంటే, మార్పు వస్తుందేమోనని మొన్న ఇక్కడికి తీసుకొచ్చాను" అన్నాడు వెంకటేశ్వర్లు.

ఈ కొద్దిక్షణాల్లోనే వెంకటేశ్వర్లు వాలకమూ, మాట్లాడే తీరూ, ఎందుకో నాకు నచ్చలేదు. అతని మాటల్లో ఏదో విశ్వసనీయత లోపించినట్టు తోచింది నాకు!

సుశీల, నాకు వరుసకు కోడలౌతుంది. సుశీల తల్లి మా పెద్దతల్లి కూతురు. ఆ పిల్ల చాలా చిన్నప్పట్నుంచీ నాకు బాగా మచ్చిక. ఎంతో తెలివైంది, చురుకైంది! ఉన్న తెలివంతా కళ్లలోనే దాచుకున్నట్టుగా మెరిసేవి ఆ పిల్ల కళ్లు. ఒక్కచోట దాని కాళ్లు పదినిమిషాలు నిలకడగా వుండేవి కావు!

ఊరంతా బలాదూరు తిరిగేది. మగపిల్లలూ, ఆడపిల్లలూ, అనే తేడా లేకుండా, అన్ని ఆటల్లోనూ పాల్గొనేది! వాళ్ల అన్నవి నిక్కరూ, చొక్కా వేసుకుని, గంతులు వేస్తూ, పరుగులు తీస్తూంటే వాళ్లమ్మ "దీనికన్నీ మగలక్షణాలే" అంటూ అబ్బురపడేది. చదువులోకూడా అంతే చురుకుగా వుండేది ఆ పిల్ల. ఉన్న ఊళ్లోనే పదోతరగతి పూర్తిచేసింది, ఫస్ట్‌క్లాస్‌లో! ఏ ప్రైవేట్లూ, గైళ్లూ లేకుండానే నాలుగు వందల యాభై మార్కులతో పాసై అందరినీ ఆశ్చర్యపరిచింది.... ఉన్న వూళ్లో జూనియర్ కాలేజీ లేదు. ఇంటర్ చదివించాలంటే 20 కి.మీ. దూరంలోవున్న టౌన్‌లో చదివించాలి. అందువల్ల పై చదువులకు వాళ్లనాన్న ఇష్టపడలేదు. సుశీల గట్టిపట్టు పట్టింది. అప్పటికి నాలుగేళ్లక్రితం అత్తెసరు మార్కులతో పది పాసయిన, తన అన్నను ఇంటరూ, ఆ తర్వాత డిగ్రీ చదివిస్తున్నాడు వాళ్ల నాన్న. "ఏం అన్నయ్యనైతే చదివిస్తున్నావు. నన్నెందుకు చదివించవు?" అంటూ వాళ్ల నాన్నను నిలదీసింది- "అన్నయ్య కంటే నేనే తెలివైనదాన్ని! అన్నయ్య కంటే మంచి మార్కులతో పాసవుతాను" అంది సుశీల. వాళ్ల నాన్న కుదరదంటే కుదరదన్నాడు. "నువ్వు ఆడపిల్లవు! టౌన్‌లో ఒంటరిగా ఎలా వుంటావు?" అన్నాడు వాళ్ల నాన్న. "ఏం అన్నయ్యకు పెట్టే ఖర్చులు నాకెందుకు పెట్టవు? అసలు నన్ను ఆడపిల్లగా నువ్వెందుకు చూస్తావ్?" అని మొండికేసేసరికి తండ్రి ఒప్పుకోక తప్పలేదు.

రోజూ ఉదయం బస్సులో కాలేజీకి వెళ్లి, సాయంత్రం తిరిగి వస్తూ తన చదువును కొనసాగించింది సుశీల. ఆ విధంగా ఐదేళ్లూ చదివి డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసై తన దక్షతనూ, శక్తినీ, తెలివినీ నిరూపించుకుంది! దురదృష్టవశాత్తూ డిగ్రీ పూర్తయిన సమయంలోనే తండ్రి చనిపోవటంతో సుశీల చదువు ఆగిపోయింది. అప్పటికే ఆమె అన్న ఉద్యోగరీత్యా పట్టణంలో వుంటుండటంతో కుటుంబం పట్టణానికి మారింది. పట్టణం చేరిన మూడు నెలలకే హఠాత్తుగా సుశీల పెళ్లికూడా జరిగిపోయింది. ఎం.ఏ.చదువుతానంటే కుదరనివ్వలేదు ఇంట్లో! కనీసం బి.యిడి. చేస్తానంటేకూడా– పెళ్లి కుదిరింది చదువుకుంటానంటే ఎలా? అని ఒప్పుకోలేదు ఆమె అన్న. వరుడు వెంకటేశ్వర్లు దూరపు బంధువు. కర్నూలులో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు లక్షల నగదూ, ఇరవై తులాల బంగారం కట్నంగా ఇచ్చి, తన బాధ్యత తీరిందనుకున్నాడు ఆమె అన్న.

పెళ్లయి ఐదు సంవత్సరాలయింది. ఒక బిడ్డకూడా! మూడేళ్లక్రితం కాన్పుకు వచ్చినపుడు నేను చూశాను ఆ అమ్మాయిని. మళ్లీ ఇదే చూడటం.నేను ఉద్యోగరీత్యా దూరపు ప్రాంతంలో పనిచేస్తూ, ఇటీవలనే ఈ వూరికి బదిలీ కావడంతో, సుశీలను చూడటం ఇప్పుడు కుదిరింది.

ఇప్పుడున్న స్థితిలో సుశీలను చూస్తుంటే నేను నమ్మలేకపోతున్నాను. ఎలాంటి సుశీల ఎలా తయారయింది? ఎంతో ధైర్యం, తెలివితేటలు, చురుకుదనం వున్న సుశీల కేవలం అనారోగ్యంవల్లే ఇలా మారిందంటే నేను నమ్మలేకపోతున్నాను.... ఇంతటి ధైర్యాన్నీ, తెలివితేటల్ని కేవలం వివాహమే ధ్వంసం చేసిందా? ఎంతటి ఆడ పిల్లల్ని కూడా పెళ్లి ఇంత నిస్సహాయంగా చేస్తుందా? గలగలా జలపాతంలా తుళ్లుతూ జీవించే సుశీల, నిశ్చల కాసారంలా ఎలా మారిపోయింది?

ఎందుకో ఆ వెంకటేశాన్ని చూస్తుంటే నాలో ఏవేవో అనుమానాలు రేకెత్తసాగాయి. వెంకటేశ్వర్లు మాటతీరూ, ప్రవర్తనా నాకు ఏదో రహస్యాన్ని అందిస్తున్నట్టే వుంది....

ఆ రాత్రి మా ఇంట్లోనే భోంచేసి వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. భోంచేసేటప్పుడు కూడా చాలా ముభావంగా వుండిపోయింది సుశీల!

మరుసటిరోజు నేను ఆఫీసునుండి ఇంటికి రాగానే నా భార్య "సుశీల వచ్చింది. మీ రూమ్‌లో వుంది." అని చెప్పింది.

"ఏమిటి విషయం" అని అడిగాను నేను.

"ఏమిటో ఆ పిల్ల చాలా ఇబ్బంది పడుతున్నట్టుగా వుంది. మీరు వెళ్లి పలకరించండి" అంది.

నేను ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకొని రూమ్‌లోకి వెళ్లేసరికి, సుశీల నిర్లిప్తంగా ఏదో పత్రిక తిరగవేస్తూ కూచొనుంది.

సుశీలకు కప్పు కాఫీ అందిస్తూ "ఏమిటమ్మా మరీ డల్‌గా కన్పిస్తున్నావ్" అన్నాను.

సుశీల నావేపు చూసింది. ఆమె కళ్లనిండా నీళ్లు! ఇప్పుడో అప్పుడో దుమకటానికి సిద్ధంగా వున్నాయి. నా పలకరింపుకు ఒక్కసారిగా భోరున ఏడ్చేసింది.

"ఏమిటమ్మా! ఏమైంది" అన్నాను నేను ఆదుర్దాగా...

"నువ్వే నన్ను రక్షించాలి మామయ్యా, నేను ఇక వాడితో కాపురం చెయ్యలేను" అంది; అలా అంటున్నప్పుడు ఆమె శరీరం వణుకుతున్నట్టు కనిపించింది-

"అసలేం జరిగింది! ఎందుకిలా వణికిపోతున్నావు" అంటూ నేను ఓదార్చబోయాను.

"నన్ను చూస్తున్నావు గదా మామయ్యా! ఇదిగో ఇలా కట్టెలా చేశాడు వాడు నన్ను!" అంది తీవ్రమైన స్వరంతో.

నా ఊహ నిజమవుతున్నట్టే అనిపించింది. ఆ వెంకటేశంగాడు ఏదోచేసే వుంటాడు.

"ఏం జరిగిందమ్మా! నాతో చెప్పు! నీకేం భయంలేదు? నేనున్నానుగదా" అన్నాను దగ్గరగా వెళ్లి ఆ పిల్ల తల నిమురుతూ.

"పెళ్లప్పుడు మేమిచ్చిన కట్నం చాలలేదట మామయ్యా. మూడేళ్లుగా ఒకటే సాధింపు. వీడొక్కడే కాదు- ఆ కొంపలోవున్న అందరికీ అదేం రోగమో ఒకటే డబ్బుపిచ్చి! పెళ్లయినప్పటి నుండి కూడా డబ్బుమాట తప్ప, మరోమాట వాళ్ల నోటి నుండి రాదు! ఏదో ప్లాట్ కొంటున్నారట! మూడు లక్షలు కావాలట! మీ అన్ననడిగి తీసుకురా అని ఒకటే ఒత్తిడి!! నామెడమీద బంగారాన్నంతా ఎప్పుడో కాజేశారు- ఎప్పుడూ ప్లాట్లు, షేర్లు! కడుపుకింత మంచి తిండి తినరు- చెయ్యనివ్వరు! పో...మీ అన్ననడుగు, అన్ననడుగు అని ఒకటే పోరు! మా అన్న సంగతి నీకు తెలుసుగదా? అతడు మాత్రం అంత పెద్ద మొత్తం ఎలా ఇస్తాడు? ఎక్కడ నుండి తెస్తాడు? ఆ మాట అంటే నీకూ ఆస్తిలో వాటా వుందిగదా? ఎందుకివ్వడు? అంటారు. నాకేదైనా ఉద్యోగం చూపించండి, చేస్తాను, అంతేగానీ డబ్బు మాత్రం మా అన్నయ్య నడగను అని తెగేసి చెప్పినాను. అయితే మా ఇంట్లో వుండటం ఎందుకు? నీ చావు నువ్వే చావు అని మొన్న ఇక్కడ దించి వెళ్లినాడు- ఎవరైనా అడిగితే మాత్రం ఆరోగ్యం బాగా లేదు అని నంగి నంగి మాటలు చెబుతాడు" అంటూ చెప్పుకొచ్చింది సుశీల.

"మీ అన్నయకు ఈ విషయం చెప్పినావా" అడిగాను నేను-

"చెప్పలేదు- చెప్పనుకూడా! ఎందుకివ్వాలి లక్షలకు లక్షలు? ఇస్తేమాత్రం నా బతుకు బాగుపడుతుందా? నేను ఒక నిర్ణయానికి వచ్చేశాను మామయ్యా! నేనిక వాడి ఇంటికి వెళ్లను. నీకు తెలిసిన ఏదో ఒక స్కూల్‌లో నాకో టీచర్ ఉద్యోగం ఇప్పించు-నా దారిన నేను బతుకుతాను" అంది సుశీల.

సుశీల నిర్ణయాన్ని నేను అభ్యంతరపెట్టదలచుకోలేదు... మళ్లీ భర్త దగ్గరకు వెళ్లి జీవచ్ఛవంలా బతకమని ఎలా చెప్పగలను? కట్టెలా మాడ్చివేసిన ఆ కిరాతకుడితో కాపురం చేయమని ఎలా ఉపదేశిస్తాను? తన కాళ్లమీద తాను ధైర్యంగా నిలబడతానని ధైర్యంగా చెప్పిన ఆడపిల్లకు ప్రోత్సాహం యివ్వటమే న్యాయం!

"అలాగే కానీ సుశీలా! నీకు ఒక మంచి స్కూల్‌లో ఈ నెలలోనే ఉద్యోగం యిప్పించే ప్రయత్నం చేస్తాను" అని భరోసా యిచ్చాను ఆమెకు.

సుశీల అన్నయ్యతో ఈ విషయాలు దాచిపెట్టటం మంచిదికాదు. మరుసటిరోజే అతడితో వాస్తవాలన్నిటినీ వివరంగా చెప్పాను. అతడు 'అమ్మో, అమ్మో' అని గుండెలు బాదుకున్నాడు. వాడి డొక్క చీలుస్తానన్నాడు. "అంతటి ఘోరాలేం చేయనక్కరలేదు- సుశీల కుదుటపడేదాకా ధైర్యం చెప్పి ఆదుకుంటే చాలు" అన్నాను.

వారం రోజుల్లోగానే నాకు బాగా తెలిసిన ఒక ప్రైవేట్ స్కూల్‌లో లెక్కలు బోధించే టీచర్‌గా చేర్పించాను. సాయంత్రం కొన్ని ట్యూషన్స్‌కూడా ఏర్పాటు చేశాడు వాళ్ల అన్న.

రెండు నెలల్లోనే ఆశ్చర్యంగా మారిపోయింది సుశీల. క్రమంగా ఆమె ఆరోగ్యం మెరుగుపడింది. కళ్లలోనూ, ముఖంలోనూ మునుపటి మెరుపు కనిపిస్తూందిప్పుడు.

మూడు నెలల తర్వాత అకస్మాత్తుగా ఊడిపడ్డాడు వెంకటేశ్వర్లు. అతనికి కొన్ని విషయాలు అర్థమైనట్టుంది- సుశీల ఉద్యోగం చేస్తూ, ఇక్కడే స్థిరపడనున్నట్టు తెలిసినట్టేవుంది! వచ్చీ రాగానే 'రేపే మనం బయలుదేరుదాం సుశీలా! ఆ చేసే ఉద్యగమేదో అక్కడే నేను ఏర్పాటు చేస్తాను"అని రాయబారానికి, రాజీకి వచ్చాడు.

ఫోన్ చేసి సుశీల నన్ను పిలిచింది-

వెంకటేశ్వర్లు, నా ఎదుటనే మళ్లీ మళ్లీ నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు- వచ్చినప్పటినుండి సుశీల అతనితో ఒక్కమాటకూడా మాట్లాడలేదట!

"ఏముంది అనటానికి మామయ్యా! అతడికి సిగ్గూ, శరమూ వుంటే బయటికి నడవమను! మేమిచ్చిన కట్నమూ, బంగారమూ ఒక బిచ్చగాడికి అపాత్రదానం చేశామనుకుంటాము. ఇతడిని బిచ్చగాడితో పోల్చడం కూడా బిచ్చగాడిని అవమానించినట్టే అవుతుంది!" అంటూ అతడి ముఖం వేపుకూడా చూడకుండా చరచరా లోపలకు వెళ్లి తలుపులు మూసేసింది సుశీల.

● *ఈ భూమి వార పత్రిక- 25-10-2007* ●